
# నేత్రపర్వంగా విజయదశమి వేడుకలు

- విజయానికి ప్రతీకగా ఊరూరా రావణ దహనం
- శమీ వృక్షం వద్ద పూజలు చేసిన నేతలు, గ్రామ పెద్దలు
- సామూహిక దసరా వేడుకల్లో పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి


మంత్రి మహేందర్‌రెడ్డికి జమ్మి ఇస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

తాండూరు, అక్టోబర్ 24: తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, యాలాల, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల్లో దసరా సంబురాలు అంబరాన్నంటాయి. ఊరూవాడల్లో శమీ, ఆయుధ, వాహన పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. హిందూ ఉత్సవ కేంద్ర సమితి, వీరశైవ సమాజం, ఆర్యవైశ్య సంఘంతో పాటు పలు కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి తాండూరు పట్టణంలోని బోనమ్మ దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సామూహిక దసరా (శమీపూజ) కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. పాలపిట్ట దర్శనం అనంతరం నేతలు, పట్టణ ప్రముఖులు కలిసి శమీ వృక్షానికి పూజలు చేసి భారీ రావణాసుర బొమ్మను దహనం చేశారు. సామూహిక దసరా వేడుకల్లో పాల్గొన్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ శమీని పూజిస్తే శత్రువులు కూడా నాశనమవుతారని పేర్కొన్నారు. హైందవ ధర్మం సనాతనమైనదని, ప్రతీ పండుగకు ఓ ప్రత్యేకత ఉందన్నారు. పండుగలు ఏవైనా కులమతాలకు అతీతంగా శాంతియుతంగా జరుపుకోవడం మంచిదన్నారు. పార్టీలకు అతీతంగా తాండూరు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తాండూరు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పాలనలో రూ.1672.49 కోట్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. రూ.1648.12 కోట్ల సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందించినట్లు వెల్లడించారు. అనంతరం ప్రజలు ఒకరికొకరు జమ్మిని పంచుకొని దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ రాజుగౌడ్, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వీణ, బీజేపీ జిల్లా కార్యదర్శి ఉప్పరి రమేశ్‌కుమార్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి కార్యదర్శి పి.నర్సింహులు, పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు, కుల సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.


తాండూరులో రావణ దహనం


మంత్రి సబితారెడ్డికి దసరా శుభాకాంక్షలు తెలుపుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు

## మంత్రి సబితారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ

చేవెళ్లరూరల్, అక్టోబర్ 24 : విజయ దశమి (దసరా) పండుగను పురస్కరించుకొని మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిని పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు నగరంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి సబితారెడ్డిని కలిసిన వారిలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌకుంట్ల సర్పంచ్ గాయత్రిగోపాలకృష్ణ, రైతుబంధు సమితి కౌకుంట్ల అధ్యక్షుడు చింతకింది నాగార్జునరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మల్లారెడ్డి ఉన్నారు.

# ఫస్ట్ లిస్ట్‌లో నో చాన్స్..

- అభ్యర్థుల కోసం 'బీజేపీ' వెతుకులాట
- జిల్లాలో ఒక్క నియోజకవర్గానికి అభ్యర్థులను ప్రకటించని వైనం
- వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గంలో పక్క జిల్లాల లీడర్లపై దృష్టి
- తాండూరు నుంచి పోటీ చేయాలంటూ కొండాపై ఒత్తిడి
- విముఖత చూపుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- పరిగిలో టికెట్ కోసం స్థానికేతరుడు ప్రయత్నాలు
- నాలుగు నియోజకవర్గాల్లోనూ బీజేపీ పోటీ నామమాత్రమే

వికారాబాద్, అక్టోబర్ 24, (నమస్తే తెలంగాణ): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించి ప్రచారంలో జోష్ పెంచగా, ప్రతిపక్షాలు మాత్రం డీలా పడ్డాయి. బీజేపీ అభ్యర్థుల మొదటి లిస్ట్‌లో జిల్లాలోని ఒక్క నియోజకవర్గానికి కూడా అభ్యర్థిని ప్రకటించకపోవడం గమనార్హం. ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించి కూడా నెల రోజులు దాటుతున్నా కనీసం డిపాజిట్ దక్కించుకునే ఓట్లు వచ్చేవారు కూడా ఆశావాహుల్లో లేకపోవడంతో ఇంకా పెండింగ్‌లోనే పెట్టింది. నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభానికి మరో వారం రోజుల సమయమే ఉన్నా పోటీనిచ్చే అభ్యర్థులు లేకపోవడంతో బీజేపీ అధిష్టానం అయోమయంలో పడిపోయింది. ప్రధానంగా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు ఆశావహులు ఎక్కువగానే ఉన్నా అసలైనోళ్లు లేకపోవడంతో ఆ పార్టీ ఇంకా అభ్యర్థుల వెతుకులాటలోనే ఉంది. జిల్లాలో బీజేపీ పార్టీకి క్యాడరే కాదు, నాలుగు నియోజకవర్గాలైన వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో చెప్పుకోదగిన నాయకులు కూడా లేరు. జిల్లాలో అస్సలు క్యాడర్‌లేని బీజేపీ అభ్యర్థుల పోటీ నామమాత్రమేనంటూ అన్ని వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తం అవుతుంది. గత ఎన్నికల్లోనూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి బీజేపీ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపినప్పటికీ తాండూరు నియోజకవర్గం మినహా మిగతా నియోజకవర్గాల్లో డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు, మరీ ఈ ఎన్నికల్లో కూడా కనీసం పోటీనిస్తారా లేదంటే గత ఎన్నికల సీన్ రిపీట్ చేస్తారనేది త్వరలో తేలనున్నది.

**ఒక్క నియోజకవర్గానికి ప్రకటించలే..**

సార్వత్రిక ఎన్నికలకు ప్రకటించిన అభ్యర్థుల మొదటి జాబితాలో జిల్లాలోని ఒక్క నియోజకవర్గానికి కూడా బీజేపీ అభ్యర్థులను ప్రకటించలేదు. రెండు నెలల క్రితం వరకు మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ బీజేపీ బరిలో ఉండడం ఖాయమని అనుకున్నప్పటికీ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కలేనని భావించిన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి జహీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అంతా సిద్ధం చేసుకుంటున్నారు. ఏ.చంద్రశేఖర్ కాంగ్రెస్‌లో చేరడంతో ఆయన వెంట ఉన్న క్యాడర్ కూడా కాంగ్రెస్‌లో చేరడం, వికారాబాద్ నియోజకవర్గంలో పోటీలో దింపేందుకు డిపాజిట్ ఓట్లు వచ్చే నాయకుడు లేకపోవడంతో ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో బీజేపీ నుంచి పోటీ చేసే అర్హతగల నాయకులు ఒక్కరూ లేకపోవడంతో పక్క జిల్లాకు చెందిన వారిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. పక్క జిల్లాకు చెందిన ఆశావహులు వికారాబాద్‌లో పోటీ చేస్తారంటూ ప్రచారం జరుగుతుంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన కొప్పు బాషా, బోసుపల్లి ప్రతాప్‌లతోపాటు కృష్ణప్రసాద్, పటాన్‌చెర్‌కు చెందిన సహదేవ్ వికారాబాద్ నియోజకవర్గ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అదేవిధంగా తాండూరు నియోజకవర్గం నుంచి పోటీ ఎన్నికల్లో పోటీ చేసిన పటేల్ రవిశంకర్‌తోపాటు లక్ష్మారెడ్డి, రమేష్‌కుమార్, నరేష్ మహారాజ్ దరఖాస్తు చేసుకున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి మూడో స్థానంతో సరిపెట్టుకున్న పటేల్ రవిశంకర్ ఈ దఫా ఎన్నికల్లోనూ పోటీ చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నా... పార్టీ అధిష్టానం మాత్రం మరొకరిని దింపే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. తాండూరు నియోజకవర్గం నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని బరిలోకి దింపాలని యోచిస్తున్నట్లు సమాచారం. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాత్రం తాండూరు నుంచి పోటీ చేసేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. పరిగి నియోజకవర్గం నుంచి భునేటి కిరణ్, ఘణపురం వెంకటయ్య తదితరులు దరఖాస్తు చేసుకోగా, శంషాబాద్ ప్రాంతానికి చెందిన భునేటి కిరణ్‌కు టికెట్ వచ్చే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతుంది. కిరణ్ స్థానికేతరుడని ముద్ర ఉండడంతో ఒకవేళ బరిలో దింపినప్పటికీ డిపాజిట్ ఓట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. గత ఎన్నికల్లో స్థానికుడైన ప్రహ్లాద్‌రావు పోటీ చేయడంతో 6 వేల ఓట్లు పోలుకాగా, ఈ దఫా ఎన్నికల్లో వెయ్యిలోపే ఓట్లు పడే పరిస్థితులున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కొడంగల్ నియోజకవర్గంలోనూ బీజేపీ నుంచి పోటీ చేసేందుకు పోటీనిచ్చే అభ్యర్థులెవరూ లేకపోవడంతో పోటీ చేశామని చెప్పుకునేందుకుగాను ఎవరినో ఒకరిని బరిలో దింపేందుకు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.



# ఎలక్ట్రానిక్ హబ్ @కొంగరకలాన్

- ఫాక్స్‌కాన్ తరహాలో కొంగరకలాన్‌లోనే కేన్స్ సెమికాన్
- రూ.3000కోట్లతో స్థాపించనున్న పరిశ్రమ
- త్వరలో ఎలిమినేడులో మరో ఎలక్ట్రానిక్ పరిశ్రమ

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 24 : రంగారెడ్డిజిల్లా కొంగరకలాన్ భవిష్యత్తులో ఎలక్ట్రానిక్ హబ్‌గా మారనున్నది. కొంగరకలాన్‌లోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఇప్పటికే చైనాకు చెందిన ప్రతినిధులు రూ.4,634కోట్లతో ఫాక్స్‌కాన్ సంస్థను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో పరిశ్రమల పనులు చకచకా సాగుతున్నాయి. 2024 మేలో ఉత్పత్తులు ప్రారంభించాలనే పట్టుదలతో పనులు చేపడుతున్నారు. ఈ పరిశ్రమకు అతిసమీపంలోనే బెంగళూరుకు చెందిన పారిశ్రామిక వేత్తలు కేన్స్ సెమికాన్ అనే మరో ఎలక్ట్రానిక్ సంస్థను ప్రారంభించారు. సుమారు రూ.3000కోట్ల పెట్టుబడులతో ఈ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర టీఎస్ఐఐసీ ఎండీ వెంకటనర్సింహారెడ్డి, రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్రసింగ్‌చౌహాన్ కలిసి మంగళవారం భూమిపూజ చేశారు. దీంతో కొంగరకలాన్‌లో రెండు ప్రముఖ ఎలక్ట్రానిక్ పరిశ్రమలు ప్రారంభమయ్యాయి. ఫాక్స్‌కాన్ కంపెనీలో ప్రత్యక్ష, పరోక్షంగా సుమారు లక్షమంది ఉపాధి పొందే అవకాశాలుండగా... కేన్స్ సెమికాన్‌లో వెయ్యిమందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అలాగే, త్వరలోనే ఎలిమినేడు గ్రామంలో కూడా మరో ఎలక్ట్రానిక్ కంపెనీని ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సంస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ఇప్పటికే టీఎస్ఐఐసీ ద్వారా భూసేకరణ చేపట్టింది. త్వరలోనే ఎలిమినేడులో కూడా మరో ఎలక్ట్రానిక్ సంస్థ ఏర్పాటు కానుంది. కేన్స్ సెమికాన్ పరిశ్రమలో అనేక రకాల ఎలక్ట్రానిక్ వస్తువుల పరికరాలను తయారుచేయనున్నారు.

**ఎలక్ట్రానిక్ రంగంలో కొత్తపుంతలు**

ఎలక్ట్రానిక్ రంగం కొత్తపుంతలు తొక్కుతున్న నేపథ్యంలో ఆయా పరికరాలకు ఉపయోగించే అతి ముఖ్యమైన పరికరాలను ఇక్కడ తయారుచేయనున్నారు. ఫాక్స్‌కాన్‌లో సెల్‌ఫోన్లు తయారు చేయనుండగా.. కేన్స్ సెమికాన్‌లో కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లతో పాటు మరికొన్ని ఎలక్ట్రానిక్ వస్తువుల్లో ఉపయోగించే అతిముఖ్యమైన సెమికండక్టర్స్‌ను ఇందులో తయారు చేయనున్నారు. ఈ ప్రాంతంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే పెట్టుబడిదారులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుండటంతో ఇతర దేశాలకు చెందిన పెట్టుబడిదారులు కూడా కొంగరకలాన్ సమీపంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారు. పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్ఐపాస్ ద్వారా దరఖాస్తులు చేసుకున్నవారికి వారంరోజుల్లో అనుమతులు జారీచేస్తున్నది. అలాగే, పెట్టుబడిదారులకు భూమి, విద్యుత్, నీరు వంటి ముఖ్యమైన సదుపాయాలను కూడా ప్రభుత్వమే కల్పిస్తుంది. అలాగే, పెట్టుబడిదారులు దర్జాగా తమ వ్యాపారాలు చేపట్టడానికి అవసరమైన భద్రతను కూడా తెలంగాణ పోలీసులు కల్పిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టడానికి మరికొంతమంది పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చే అవకాశాలున్నట్లు తెలిసింది.



ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ చౌహాన్